ఈనాడు
ఖమ్మం
బుధవారం అక్టోబరు 16, 2024

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో దీపావళి బాణసంచా దుకాణాల ఏరాటుకు వ్యాపారులు ఈ నెల 25వ తేదీలోపు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్, అగ్నిమాపక శాఖ, నగరపాలక సంస్థ నిర్దేశించిన ప్రదేశంలో.. అనుమతితోనే దుకాణాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: తుమ్మల

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధి 46వ డివిజన్ సారథినగర్‌లో రూ.కోటితో నిర్మించనున్న (స్టామ్ వాటర్ డ్రైనేజీ) పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇతర నగరాలకు దీటుగా ఖమ్మాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. సెప్టెంబరులో అకస్మాత్తుగా వరదలు వచ్చినపుడు ప్రాణనష్టం జరగకుండా సేవలందించిన ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నిర్మించే మురుగు కాల్వల నిర్మాణం పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. పేదలకు ఇళ్ల స్థలాలు అందించిన తర్వాత ఆక్రమణలను తొలగిస్తామని చెప్పారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి, కమర్తపు మురళి, నాయకులు ఎర్రం బాలగంగాధర్ తిలక్, సాధు రమేశ్ రెడ్డి, సైదుబాబు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో రాయల, నీరజ, అభిషేక్ అగస్త్య

రంగులద్ది.. వక్రబుద్ధి!

తెల్లగా మారిన నల్లబెల్లం.. ఏడు నెలల్లో 3 టన్నుల పట్టివేత

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

గుడుంబా తయారీకి ఉపయోగించే నల్ల బెల్లం రవాణాపై నిషేధం ఉంది. ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకుంటున్నా.. ఆబ్కారీ పోలీసులు. దీంతో తయారీదారులు 'రంగు' మార్చారు. కొత్త ఎత్తులతో అధికారులను ఏమార్చుతున్నారు. అదెలాగంటే.. ఖమ్మం జిల్లా సరిహద్దులోని మహబూబాబాద్, భద్రాచలం ఏజెన్సీలో కొన్నాళ్లుగా గుడుంబా తయారవుతోంది. అక్కడకు పలు మార్గాల్లో నల్లబెల్లం అక్రమంగా తరలుతోంది. మరోవైపు ఆబ్కారీ బృందాలు గాలింపులు కొనసాగుతున్నాయి. బెల్లం ఊటను పెద్ద ఎత్తున ధ్వంసం చేస్తున్నారు. అయినా తమ కళ్లుగప్పి నల్ల బెల్లాన్ని ఎలా తరలిస్తున్నారని పోలీసులు అవాక్కవుతున్నారు. లోతుగా పరిశీలిస్తే అసలు రంగు బయటపడింది. అదేమంటే.. ఇల్లెందు సమీపంలో ఇటీవల ఓ వాహనంలో తరలుతున్న 9 టన్నుల బెల్లం కొత్తగూడెం జిల్లా ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది. చూస్తే పైపైన మొత్తం తాజా తెల్ల బెల్లంలా కనిపించింది. కానీ పగలగొట్టి చూస్తే అంతా నల్లబెల్లమే! దాన్నంతా రసాయనాలు చల్లి రంగు మార్చినట్లు అధికారులు గుర్తించారు. సరకంతా నాలుగు రోజుల తర్వాత మళ్లీ నలుపు రంగులోకి యథాతథ స్థితికి వస్తుందట. ఇదిలా ఉంటే.. రంగు మార్చిన బెల్లాన్ని ఈ ఏడాది జూన్ నుంచి జులై వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 3,018 కిలోలు పట్టుకున్నారు. గుట్టుగా తరలించిన సరకు ఇంతకు ఐదు రెట్లు ఉంటుందని అంచనా.


రంగు మార్చిన బెల్లం ముద్దలు

ఎక్కడెక్కడ తయారవుతోందంటే?

బెల్లం తయారీ కేంద్రాల్లో మిగిలిన వ్యర్థాలు, మగ్గిన పదార్థాలను కిలో రూ.20కి కొనుగోలు చేస్తున్నారు. దానిపై తెల్లటి రసాయనాలు చల్లి రంగు మార్చుతున్నారు. గుడుంబా తయారీదారులకు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో తేలింది. నిల్వలను సైతం కాలం చెల్లిన వాహనాల్లోనే తరలిస్తున్నారు. తనిఖీల బెడద, ధరాభారంతో కొందరు రూటు మార్చారు. గుడుంబాను చక్కెరతో తయారుచేస్తున్నారు. తెలుపుదనం కోసం పటికకు బదులు చైనా నుంచి తప్పించే తెల్లని పొడిని వాడుతున్నారు. ఈస్ట్ సైతం వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో గుడుంబా తయారీని ఎలా కట్టడి చేయాలా? అని ఆబ్కారీ శాఖ తలలుపట్టుకుంటోంది.

ముమ్మర తనిఖీలు చేపడతాం..

ఎక్సైజ్ శాఖ సహాయ కమిషనర్ గణేష్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జిల్లా టాస్క్‌ఫోర్స్, స్థానిక స్టేషన్ బృందాలతో కలిసి గుడుంబా తయారీపై నిఘా పెంచాం. బెల్లం రంగు మారుస్తున్న విషయాన్ని పసిగట్టాం. సరకు తరలకుండా ముమ్మర తనిఖీలు కొనసాగిస్తాం' అని చెప్పారు.

టీచరమ్మ.. నీకు తిరుగేలేదమ్మ!!

ఖమ్మం విద్యావిభాగం, పాల్వంచ విద్యా విభాగం, న్యూస్‌టుడే

విద్యావంతులైన మహిళలు ప్రభుత్వ కొలువుల సాధనలో ముందంజలో నిలుస్తున్నారు. పురుష అభ్యర్థులతో సమానంగా పోటీ పడుతున్నారు. గతంలో పోలీస్ ఉద్యోగాల భర్తీలో మహిళా పోస్టులకు విపరీతమైన పోటీ నెలకొనడం విశేషం. ఆ తర్వాత అటవీ శాఖ ఉద్యోగాల్లోనూ క్లిష్టమైన పరీక్షలెదుర్కొని ప్రతిభచూపిన వారెందరో ఉన్నారు. వారు సుదీర్ఘ నడక సాగించి మరీ తమ పట్టుదలను నిరూపించారు. తాజాగా నియామక ప్రక్రియ పూర్తయిన 'డీఎస్సీ-2024'లో ఉమ్మడి జిల్లాలో పురుషుల కన్నా ఎక్కువ మంది మహిళా అభ్యర్థులే ఉపాధ్యాయ కొలువు చేపట్టారు. కేటాయించిన విద్యాలయాల్లో వారు నేటి (బుధవారం) నుంచి బోధన చేపట్టనున్నారు.

తాజా డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ), స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ), ప్రత్యేక విద్య, వ్యాయామ ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేశారు. ఇవి ప్రభుత్వ, స్థానిక సంస్థల విద్యాలయాల వారీగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 520కి గాను మహిళా అభ్యర్థులే 268 మంది (51.53శాతం) ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పోస్టులకు పురుషులు 28, మహిళలు 30 మంది ఎంపికయ్యారు. స్థానిక సంస్థల పాఠశాలల్లో చేరుతున్నవారిలో పురుషులు 224, మహిళలు 238 మంది ఉన్నారు. ప్రాథమిక విద్యాలయాల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు బోధన చేస్తారు. ఈ పోస్టుల్లో మహిళలదే హవా కనిపించింది. మొత్తం 293కి గాను 185 వారే దక్కించుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మొత్తం 413కి గాను 223 (54 శాతం) పోస్టులు మహిళలవే. ఎస్జీటీ పోస్టుల్లో పురుషులు 95, మహిళలు ఏకంగా 156 పోస్టులు సాధించి శెభాష్ అనిపించుకున్నారు.



ఏఏ పోస్టులకు ఎంతమంది..

సబ్జెక్టు	పురుషులు	మహిళలు
పండిట్-హిందీ	06	04
పండిట్-తెలుగు	04	03
పీఈటీ	9	01
స్కూల్ అసిస్టెంట్		
బయాలజికల్ సైన్స్	25	16
ఆంగ్లం	07	02
హిందీ	05	04
గణితం	26	09
పీఈటీ-ఎస్ఏ	04	-
ఫిజికల్ సైన్స్	01	-
సోషల్	42	16
తెలుగు	06	09
ఎస్జీటీ-తెలుగు	116	199
ఎస్జీటీ-ఉర్దూ	01	05


కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయినుల సందడి..

ఫలించిన.. 23 ఏళ్ల నిరీక్షణ!

డీఎస్సీ కొలువు కల 23 ఏళ్ల నిరీక్షణ తర్వాత ఫలించిందామెకు. తాజా నోటిఫికేషన్‌లో హిందీ పండిట్‌గా ఉద్యోగాన్ని సాధించి.. చర్ల మండలం తేగడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నేడు (బుధవారం) బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమే.. **తురుమెళ్ల కళ్యాణి.**



కొత్తగూడెంకు చెందిన కళ్యాణి సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల ఒప్పంద ఉపాధ్యాయురాలు. ఎంఏ హిందీ పండిట్ పూర్తిచేసి.. గత 23 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయ పరీక్షలు రాస్తున్నారు. అదే సమయంలో వివిధ పాఠశాలల్లో పనిచేస్తూ వస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా సింగరేణి పాఠశాలలో బోధన కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు కవయిత్రి, రచయిత, రేడియో వ్యాఖ్యాత ప్రవృత్తిలో రాణిసున్నారు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో జిల్లా నాలుగో ర్యాంకు సాధించి విజయం సాధించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు సాయి సుజాత, ఉపాధ్యాయుల అభినందనలు అందుకున్నారు.

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే


కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

ప్రశాంతంగా ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 ఉపాధ్యాయ నియామకాల్లో ఎంపికైన వారికి ఖమ్మం నగరంలోని డైట్ కళాశాలలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రోస్టర్, ర్యాంకుల ఆధారంగా కోరుకున్న చోట స్థానాలు కేటాయిస్తూ డీఈఓ సోమశేఖరశర్మ ఉత్తర్వులు ఇచ్చారు. అంతకు ముందు ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రక్రియను కాసేపు వాయిదా వేశారు. వచ్చిన వారి హాజరు నమోదు చేసుకున్నారు. తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కౌన్సెలింగ్ మొదలైంది. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు ఇబ్బందిపడ్డారు. 520 మంది హాజరు కావడంతో ప్రాంగణం కళకళలాడింది. సాయంత్రం 6 తర్వాత గంట పాటు విద్యుత్తు లేక టార్చ్ లైట్ వెలుగులోనే కౌన్సెలింగ్ కొనసాగించారు. పొద్దుపోయే వరకు కౌన్సెలింగ్ కొనసాగింది. కార్యాలయ సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు, ఏఎస్ఓ కిశోర్, ఏపీఓ శ్రీనివాసరావు, ఎంఈఓలు సహకరించారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు షురూ


గుర్రాలపాడు సీసీఐ కేంద్రం వద్ద డీఎంఓ అలీం, మార్కెటింగ్, సీసీఐ అధికారులు, సిబ్బంది

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

జిల్లాలో పత్తి కొనుగోళ్లకు భారత పత్తి సంస్థ(సీసీఐ) ఏర్పాట్లు చేసింది. నేటి నుంచి ఖమ్మం, మద్దులపల్లి, వైరా, మధిర, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ల పరిధిలోని జిన్నింగు మిల్లుల్లో (సీసీఐ కేంద్రాలు) కొనుగోళ్లు ప్రారంభిస్తారు. క్వింటాకు కనీస మద్దతు ధర రూ.7,521 చెల్లిస్తారు. తేమ 8 శాతం మించొద్దు. అంతకు ఎక్కువ ఉంటే ప్రతి ఒక శాతానికి రూ.75.21 చొప్పున ధర తగ్గుతుంది. ఆధార్ లేని రైతులు నమోదు గుర్తింపు పత్రం, శాశ్వత ఖాతా సంఖ్య(పాన్ కార్డు), లేదా పాస్‌పోర్టు, ఓటరు గుర్తింపు కార్డు, ఏదైనా మంత్రిత్వ శాఖ నుంచి పొందిన ఇతర ధ్రువీకరణ పత్రం తీసుకురావాల్సి ఉంటుంది. బస్తాల్లో కాకుండా లూజుగా తీసుకువస్తే పత్తి నాణ్యత బాగుంటుంది. బస్తాల ఖర్చు, ఎగుమతి, దిగుమతి ఖర్చులూ ఆదా అవుతాయి. కొనుగోళ్లు వేగంగా జరుగుతాయి. ఒకేసారి కాకుండా నిర్వాహకులు, అధికారుల సూచనల ప్రకారం దశలవారీగా పంటను తీసుకురావాలి. కొనుగోళ్ల ఏర్పాట్లను జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు.

నీటిపారుదల శాఖ సర్కిల్ ఎస్ఈగా వెంకటేశ్వర్లు



ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం నీటిపారుదల శాఖ సర్కిల్ ఎస్ఈగా డివిజన్-1 ఈఈ మంగళంపుడి వెంకటేశ్వర్లుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎస్ఈ నర్సింగరావు 26వ తేదీ వరకు సెలవులో వెళ్లారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. సాగర్ ఆయకట్టుకు సాగునీటి సరఫరా పర్యవేక్షణ నేపథ్యంలో వెంటనే వెంకటేశ్వర్లుకు బాధ్యతలు అప్పగించారు. ఆయన పరిధిలోకి ఖమ్మం, పాలేరు, వైరా నియోజకవర్గాలు వస్తాయి.

సహకార ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా సుబ్బారావు..

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా సహకారశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎన్.సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా టి.ఆనంద్‌బాబు, కార్యదర్శిగా ఈ.స్వప్న, డైరెక్టర్లుగా మైకుమారి, ఉష, వెంకటరమణ, రామకృష్ణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రవికుమార్ వ్యవహరించారు.

నేను.. మీ కలెక్టర్‌ను.. బాగున్నారా!

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఖమ్మం నగరంలో ఆకస్మిక పర్యటన చేశారు. 'నమస్కారం.. బాగున్నారా.. నేను మీ కలెక్టర్‌ను.. వ్యాపారం ఎలా నడుస్తుంది..' అంటూ వ్యాపారులు, ఆటో డ్రైవర్లను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఖమ్మం నగర బస్టాండుకు ఆనుకొని షాదీఖానా వెళ్లే రోడ్డులో ఉన్న ఫుట్‌వేర్ దుకాణంలోకి వెళ్లిన కలెక్టర్ 'వ్యాపారం ఎలా నడుస్తుంది.. రోజు వారీ సంపాదన, కుటుంబ పోషణ, పిల్లల చదువు వంటి వివరాలను' నిర్వాహకుడు సయ్యద్ బిలాల్‌పాషాను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు, ముద్ర రుణాలపై అవగాహన కల్పించారు. బస్టాండు సిగ్నల్ ప్రాంతంలో ఆటో స్టాండు వద్దకెళ్లి ఆటో డ్రైవర్లతో ముచ్చటించారు.


ఆటో డ్రైవర్ల సమస్యలు ఆలకిస్తూ..

క్రికెట్ ఎంపికలకు స్పందన

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం నిర్వహించే అండర్ 23 క్రికెట్ లీగ్‌లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపికలు మంగళవారం ఖమ్మం స్టేడియంలో జరిగాయి. మ్యాచ్‌లలో ప్రతిభ చూపిన 72 మందిని జిల్లా క్రికెట్ సంఘం ఎంపిక చేసింది. తుది జట్టును ప్రకటించనున్నట్లు కార్యదర్శి చేకూరి వెంకట్ చెప్పారు.



19 నుంచి జిల్లా జట్ల ఎంపికలు.. రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడల్లో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్లను ఈ నెల 19, 20 తేదీల్లో సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్టు కార్యదర్శి నర్సింహమూర్తి తెలిపారు. 18 క్రీడాంశాలు ఖమ్మం జిల్లాలో, 25 క్రీడాంశాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కేటాయించినట్లు చెప్పారు. ఆసక్తిగలవారు పత్రాలతో ఉ.10 గంటలకు స్టేడియానికి రావాలన్నారు.


క్రీడా జ్యోతితో చిన్నారి

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 76 కిలో మీటర్ల దూరం ర్యాలీ కోసం వచ్చిన 'సీఎం కప్ క్రీడా జ్యోతి బృందం' మంగళవారం ఖమ్మం నగరానికి చేరుకొంది. నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ర్యాలీకి తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి స్వాగతం పలికి మాట్లాడారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వం నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతోందని చెప్పారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ.. ఎంచుకున్న లక్ష్యం కోసం వెనకడుగు వేయకుండా ముందుకు సాగితేనే విజేతలుగా నిలుస్తారన్నారు. అనంతరం అతిథులు, అధికారులు, క్రీడాకారులు క్రీడా జ్యోతితో లకారం ట్యాంక్‌బండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి క్రీడా సంఘాల సభ్యులు, శిక్షకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం స్టేడియం నుంచి క్రీడా జ్యోతి ర్యాలీ బయలుదేరుతుందని సీనియర్ శిక్షకులు రత్నబోస్, గౌస్ తదితరులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.180 కోట్లు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లాల్లోని గ్రామీణ రహదారులను తారు రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ.105 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రహదారుల అభివృద్ధికి నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు గతంలో పంపారు. మంత్రి సీతక్క ఆమోదంతో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం నియోజకవర్గం రఘునాథపాలెం మండలంలో 12 రహదారుల అభివృద్ధికి రూ.25 కోట్లు, పాలేరులో 12 పనులకు రూ.25 కోట్లు, మధిరలో 6 పనులకు రూ.25 కోట్లు, వైరాలో 5 పనులకు రూ.15 కోట్లు, సత్తుపల్లిలో 8 పనులకు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో టెండర్లు నిర్వహించి పనులు చేపట్టనున్నారు.

సర్కారీ కార్యాలయాలు.. విసిరేసినట్టు!

ఖమ్మం గ్రామీణం, కూసుమంచి, న్యూస్‌టుడే

ఓ నిరుద్యోగి ఎస్సీ కార్పొరేషన్ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే జలగం నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వెళ్లాలి. అందుకు ధ్రువపత్రాలు కావాలంటే ఖమ్మం నగరంలోని తహసీల్దార్ (గ్రామీణ) కార్యాలయాన్ని సంప్రదించాలి. ఉద్యోగ ప్రకటనలు తెలుసుకునేందుకు, పుస్తకాలు చదువుకునేందుకు రోటరీనగర్ రావాలి. దారిలో దురదృష్టవశాత్తు ఏవైనా ధ్రువపత్రాలు జారిపోతే ఫిర్యాదు చేరటానికి వరంగల్ క్రాస్‌రోడ్డులోని ఠాణాను ఆశ్రయించాలి. ఓ వ్యక్తి ఇన్ని కార్యాలయాలకు వెళ్లాలంటే కనీసం రూ.వందలు ఛార్జీలకే పోతాయి. అదే అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉంటే సమయం, డబ్బులు ఆదా అవుతాయి. ఖమ్మం గ్రామీణ మండలంలో అన్ని వర్గాల వారూ ఇదే తరహా ఇబ్బంది పడుతున్నారు.

1985లో మండల వ్యవస్థకు శ్రీకారం చుట్టిన క్రమంలో తిరుమలాయపాలెం సమితి నుంచి కొన్ని గ్రామాలను వేరుచేసి ఖమ్మం గ్రామీణం మండలాన్ని ఏర్పాటు చేశారు. 2012లో కొన్ని గ్రామాలు నగరపాలకంలో విలీనమయ్యాయి. ప్రస్తుతం 28 పంచాయతీలున్నాయి. ఇంత పెద్ద విస్తీర్ణంలో ఉన్న మండలానికి నేటికీ ఒక కేంద్రం అన్నదే లేదు. పెద్దతండానే పెద్ద దిక్కుగా భావిస్తున్నారు. పేరులో గ్రామీణం.. తీరులో పట్టణీకరణం. జిల్లాకేంద్రాన్ని ఆనుకుని అనేకంటే అతుక్కుని ఉండే ఈ మండలంలో పనిచేయటం ఉద్యోగులకు ఎంతో సౌలభ్యం. కానీ పనులు చేయించుకోవాలంటే మాత్రం మండల వాసుల తలప్రాణం తోకకు వచ్చినట్టవుతుంది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ విసిరేసినట్టుగా ఉన్నాయి. కొన్ని పెద్దతండాలో.. ఇంకొన్ని నగరంలో కొనసాగుతున్నాయి. నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమస్యపై దృష్టిసారించి కార్యాలయాలన్నింటినీ ఒకే గొడుకు కిందకు తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎక్కడెక్కడ ఏ కార్యాలయం?

- జలగంనగర్..: ఎంపీడీఓ, మండల వ్యవసాయాధికారి కార్యాలయం, మండల వనరుల కేంద్రం, మండల సమాఖ్య కార్యాలయాలున్నాయి.
- వరంగల్‌క్రాస్‌రోడ్డు: పోలీసు ఠాణా
- ఎంవీపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- కోదాడక్రాస్‌రోడ్డు: సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు
- మండలం వెలుపల ఉన్న కార్యాలయాలు: తహసీల్దారు ఆఫీసు (ఖమ్మం కాల్వొడ్డు సమీపంలో), గ్రంథాలయం (ఖమ్మం రోటరీనగర్), డీసీసీబీ బ్యాంకు (ప్రకాశ్‌నగర్), సీడీపీఓ కార్యాలయం (ఖమ్మం గట్టయ్య సెంటర్), రూరల్ డీఈ కార్యాలయం (ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు).



కాల్వొడ్డు ప్రాంతంలో తహసీల్దారు కార్యాలయం

గతంతో పోలిస్తే..

ప్రారంభంలో కార్యాలయాలన్నీ ఖమ్మంలోనే ఉండేవి. స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల వరుస విజ్ఞప్తుల క్రమంలో 1998లో పోలీసు ఠాణాను వరంగల్‌క్రాస్‌రోడ్డులోకి మార్చారు. 2009లో ఎంపీడీఓ కార్యాలయాన్ని జలగంనగర్‌లోని నూతన భవనంలోకి తరలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని 3 నెలల క్రితమే ఖమ్మం నుంచి కోదాడ అడ్డరోడ్డులోని అద్దె భవనంలోకి చేర్చారు.

ఇవి తాగితే అనారోగ్యంపాలు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే



ఉదయం నిద్ర లేవగానే టీ తాగకపోతే కొంతమందికి పొద్దు గడవదు.. పిల్లలకు పాలు, అన్నంలోకి పెరుగు, మజ్జిగ తయారీకి పాలు నిత్యావసరంగా మారాయి. ఇటువంటి క్షీరాన్ని కొంతమంది ప్రబుద్ధులు కల్తీ చేస్తున్నారు. గతంలో చిక్కని పాలల్లో కాసిన్ని నీళ్ల కలిపేవారు. ఇప్పుడు ఏకంగా నకిలీ పాలను తయారు చేస్తున్నారు. కొంతమంది విషపూరిత డిటర్జెంట్, యూరియా వంటివి కలుపుతున్నారు. పాల కల్తీపై జిల్లాలో కేసులు నమోదవుతున్నాయి. నమ్మకమైన వ్యక్తుల/సంస్థల నుంచి కొనుగోలు చేయాలని, అనుమానం వస్తే పరీక్షించి చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

★ ఉమ్మడి జిల్లాలో పాల ఉత్పత్తి తగ్గుతోంది. డిమాండ్ పెరుగుతోంది. దీంతో కొంతమంది కల్తీకి పాల్పడుతున్నారు. అపరిశుభ్రమైన నీరు కలపడంతోపాటు విష రసాయనాలు మిళితం చేస్తున్నారు. కొన్ని రకాల పొడులు, నురగ వచ్చేలా సబ్బు పొడి, తెల్లదనం కోసం యూరియా కలుపుతున్నట్లు గతంలో పోలీసులు గుర్తించారు. కల్తీ పాలను వినియోగిస్తే అనారోగ్యం, దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నమోదైన కేసులు	
2022-23	15
2023-24(నేటి వరకు..)	8

మరింత అప్రమత్తంగా ఉండాలి



పాల కల్తీతో ప్రజారోగ్యానికి తీవ్రమైన హాని కలుగుతుంది. సరైన పోషకాలు అందకపోతే పిల్లల ఎదుగుదల, మానసిక వికాసం జరగదు. పాల కల్తీ నేరం. అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుని కల్తీ వినియోగాన్ని అడ్డుకోవచ్చు.

- లగడపాటి వెంకటేశ్వరరావు, విశ్రాంత మేనేజరు, డెయిరీ టెక్నాలజిస్టు

గుర్తించే పద్ధతులు

☛ **నీళ్లు కలిపిన పాలు:** ఓ చుక్క పాలను నున్నని, ఏటవాలు ప్రదేశంలో ఉంచినప్పుడు స్వచ్ఛమైనవి నెమ్మదిగా కదులుతూ అవి జారిన తలంపై తెల్లని మచ్చ ఏర్పడుతుంది. నీళ్లు కలిసినవి త్వరగా ప్రవహించి, ఎటువంటి మచ్చ జాడ కనిపించదు.

☛ **పిండి పదార్థాల కల్తీ:** పాలలో కొన్ని చుక్కల అయోడిన్ ద్రావణాన్ని కలిపినప్పుడు నీలి రంగుకు మారితే పిండి పదార్థాల కల్తీ జరిగినట్లు.

☛ **యూరియా కలిపితే..:** టీస్పూను పాలకు అర చెంచా సోయాబీన్ పిండిని కలిపి మిశ్రమాన్ని బాగా కలియదిప్పి 5 నిమిషాల తరువాత ఆ పాలలో ఎర్ర లిట్మస్ కాగితాన్ని ముంచితే నీలి రంగుకు మారుతుంది. లిట్మస్ పేపర్లు అన్ని మందుల దుకాణాల్లో లభిస్తాయి.

☛ **డిటర్జెంట్ కల్తీ:** 5 మిలీ పాలు, 5 మిలీ నీళ్లు కలిపి బాగా కలియ తిప్పితే నురగ ఏర్పడితే డిటర్జెంట్ కల్తీ జరిగినట్లు.

☛ **కృత్రిమ పాలు:** చేదు రుచి కలిగి, వేళ్ల మధ్యలో తీసుకొని రుద్దినప్పుడు సబ్బు వంటి భావన కలుగుతుంది. వేడి చేసినప్పుడు పసుపు రంగుకు మారతాయి. కృత్రిమ పాల తయారీకి నీళ్లు, రంగులు, చౌక నూనెల, క్షార ద్రావణాలు, యూరియా, డిటర్జెంట్లు వాడతారు.

ఒక్క పోస్టూ లేకపాయె..!

డిప్యూటేషన్లు, సీఆర్టీ సిబ్బందితో నెట్టుకొస్తున్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే



ఈ చిత్రంలో కనిపించేది ఖమ్మం గ్రామీణ మండలం గొల్లగూడెంలోని గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల. శాశ్వత భవనం, వసతి గృహంతోపాటు అన్ని సదుపాయాలూ ఉన్నాయి. పాఠశాలలో 400ల మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఖమ్మంలోని గిరిజన ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని 2013లో ఆశ్రమ పాఠశాలగా మార్చారు. 2016లో గొల్లగూడెంలోని శాశ్వత భవనంలోకి దీన్ని చేర్చారు. ఈ పాఠశాల ఏర్పాటై 11 ఏళ్లు అవుతున్నా ఇప్పటివరకు ఒక్క ఉపాధ్యాయ పోస్టు మంజూరు కాలేదు. ప్రస్తుతం పాఠశాలలో అయిదుగురు డిప్యూటేషన్‌పై, 12 మంది సీఆర్‌టీ (ఒప్పంద) పద్ధతిలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థులు చదివే పాఠశాలలకు, ఉండే వసతి గృహాల మధ్య దూరం ఉండేది. రాకపోకలు సాగించేందుకు విద్యార్థులకు ఇబ్బందయ్యేది. ఆడపిల్లల విషయంలో భద్రతాపరమైన సమస్యలూ తలెత్తేవి. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఏపీలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మారుస్తూ 2012లో నాటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి అనుగుణంగా ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో మొత్తం 15 పాఠశాలలను గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలుగా మార్చారు. 2012లో ఒక్కటి, 2013లో 14 ఏర్పాటయ్యాయి.

పాఠశాలలివే..

ఖమ్మం.. ముదిగొండ మండలం వల్లభి, ఖమ్మం గ్రామీణం గొల్లగూడెం, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లిలో గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలు

◆ ఖమ్మం ముస్తఫానగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, రేవతి సెంటర్‌లో బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల (ఈ రెండు పాఠశాలలు ప్రస్తుతం కొణిజర్ల మండలంలోకి మార్చారు.)

◆ సత్తుపల్లిలో ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలను కొంతకాలానికే మూసేశారు.

భద్రాద్రి

◆ ఇల్లెందు(ఎ), భద్రాచలం-బిలో బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల

◆ ఇల్లెందు(బి), మణుగూరు, అశ్వారావుపేట, జూలూరుపాడు మండలంలోని పడమటి నర్సాపురం, భద్రాచలం-ఎ, బూర్గంపాడులో బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలు.

ఉపాధ్యాయులు కరవు

15 పాఠశాలల్లో ప్రస్తుతం 14 మాత్రమే ఉన్నాయి. అన్ని చోట్లా డిప్యూటేషన్‌పైన, ఒప్పంద ఉపాధ్యాయులతోనే నెట్టుకొస్తున్నారు. 11 ఏళ్లుగా ప్రభుత్వాలు ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ప్రభుత్వం తమ పరిధిలో పోస్టులు కేటాయించి, భర్తీ చేసుకుంది. తెలంగాణలో ఆ ప్రక్రియ ప్రారంభానికి నోచుకోలేదు. ఫలితంగా వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న విద్యాలయాల్లో శాశ్వత ఉపాధ్యాయులే కరవయ్యారు. భవనాలు, వసతి గృహాలు ఉన్నా బోధకులు లేకుండానే కొనసాగుతున్నాయి. స్థానిక అధికారులే చొరవ తీసుకొని డిప్యూటేషన్‌పైన కొంత మంది ఉపాధ్యాయులను నియమించి, మరికొంత మందిని సీఆర్‌టీ (ఒప్పంద ఉపాధ్యాయులు)లను నియమించి ఏ ఏడాదికి ఆ ఏడాది విద్యాసంవత్సరాన్ని ముగించేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

విజయలక్ష్మి, ఐటీడీఏ డీడీ

ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. పోస్టుల మంజూరుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

17నుంచి గెలల సేకరణ నిలిపివేత

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: ఆయిల్‌పాం గెలలు తక్కువగా వస్తున్న కారణంగా ఈనెల 17నుంచి అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో వార్షిక మెయింటెనెన్సు చేపడుతున్నామని.. ఈ నేపథ్యంలో ఆయిల్‌పాం గెలల సేకరణను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఆ రోజు నుంచి దమ్మపేట మండలం అప్పారావుపేట పరిశ్రమకు యథావిధిగా గెలలు తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బకాయిలు చెల్లించే వరకు కళాశాలలు తెరవలేం

యాజమాన్యాల సంఘం స్పష్టీకరణ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రెండోరోజూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు మూతపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించనందుకు నిరసనగా యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేశాయి. బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు చెందిన యాజమాన్యాల బాధ్యులు మంగళవారం ఖమ్మంలో సమావేశమయ్యారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సమస్య పరిష్కారమయ్యే వరకు కళాశాలలు తెరిచేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌జేసీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ, కవిత మెమోరియల్ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, డీఆర్‌ఎస్ కళాశాల కరస్పాండెంట్ వి.మోహన్‌రెడ్డి, ప్రియదర్శిని కళాశాల కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్‌బాబు, గాయత్రి కళాశాల కరస్పాండెంట్ కుతుంబాక సునీల్‌కుమార్ పాల్గొన్నారు.




సమావేశంలో పాల్గొన్న మద్ది ప్రభాకర్‌రెడ్డి, గుండాల కృష్ణ, కోట అప్పిరెడ్డి, కాటేపల్లి నవీన్‌బాబు, మోహన్‌రెడ్డి, సునీల్‌కుమార్

పచ్చని చెట్లు.. తివాచీ పరిచినట్లు!



పినపాక మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల పచ్చని చెట్లతో కళకళలాడుతోంది. ప్రధాన ద్వారం నుంచి పాఠశాల సముదాయం, వసతిగృహం వరకు సీసీ రహదారికి ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నాటిన మొక్కలు ప్రస్తుతం తోరణాల్లా మారాయి. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. **- పినపాక, న్యూస్‌టుడే**

నిండుకున్న తటాకం.. కరవు తీర్చిన ఉపాయం



ఈ దఫా వర్షాకాలంలో విస్తారంగా వర్షాలు కురిసినా చెరువుల్లో నీరు సమృద్ధిగా లేవు. ఫలితంగా ఓ రైతు ట్రాక్టర్‌నే విద్యుత్తు మోటారుగా మార్చి అర కిలో మీటర్ వరకు పైపులు అమర్చి పొలానికి నీళ్లు సరఫరా చేస్తున్నారు. మణుగూరులోని ముత్యాలమ్మనగర్ రహదారి పక్కనే ఉన్న పొలాలకు సరిపడా నీరు అందడంలేదు. స్థానిక ఆయకట్టుకు నీరందించే చెరువులో కనీసం తూము వరకు కూడా నీళ్లు లేవు. ఈక్రమంలో కణితి రమేష్ అనే రైతు తన బంధువులకు సంబంధించిన వరి పొలానికి చెరువు నుంచి నీరు అందించేందుకు ఏకంగా తన ట్రాక్టర్‌కే మోటారును బిగించారు. చెరువులో పైపులను వదిలి దూరంగా ఉన్న పంటకు నీరు సరఫరా చేస్తున్నాడు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ట్రాక్టర్ మోటారు ద్వారానే పొలానికి నీళ్లు తరలించాడు. **- మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే**

తగ్గిందా.. కిక్కు?



వైరా, న్యూస్‌టుడే: దసరా సీజన్ నేపథ్యంలో అమాంతం పెరగాల్సిన మద్యం అమ్మకాలు ఉమ్మడి జిల్లాలో కాస్త తగ్గుముఖం పట్టాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో 210 మద్యం దుకాణాలు, 50 బార్లు, 3 క్లబ్బులున్నాయి. సహజంగా దసరా వంటి ముఖ్యమైన పండగ సమయంలో మద్యంప్రియులు తమ జోష్ కనబరుస్తుంటారు. కానీ ఈసారి మాత్రం అమ్మకాలు తగ్గాయి. ఈనెల 14వ తేదీ వరకు అమ్మకాలు రూ.48.14 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా గతేడాది అక్టోబరు 14 వరకు రూ.49.90 కోట్ల అమ్మకాలు జరిగాయి. మద్యం అమ్మకాలను గతేడాది నెలతో పోల్చుతూ లక్ష్యాలను నిర్దేశిస్తుంటారు. దీని ప్రకారం సుమారు రూ.1.76 కోట్ల అమ్మకాలు తగ్గినట్లు అధికారులు గుర్తించారు. గతేడాది అక్టోబరు నెల మొత్తంగా రూ.141 కోట్లు జరిగాయి. కానీ ఈసారి ఆ మార్కును దాటుతారో లేదో చూడాల్సి ఉంది. అమ్మకాలు బాగా తగ్గుతుండటంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు దుకాణాల వారీగా అమ్మకాలు పెంచాలని, డిపో నుంచి ఎక్కువ మద్యం కొనుగోలు చేయాలంటూ దుకాణదారులకు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం(15వ తేదీ) ఒక్కరోజే రూ.8.70 కోట్లు అమ్మకాలు జరిగాయి. ఏపీలో అన్ని రకాల బ్రాండ్లు లభిస్తుండటం కూడా మద్యం అమ్మకాలు తగ్గేందుకు మరో కారణంగా భావిస్తున్నారు.

రూ.6.80 కోట్లతో మార్కెట్ ఆధునికీకరణ

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునికీకరణకు ప్రభుత్వం అదనంగా రూ.6.80 కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు రాష్ట్ర సహకార, మార్కెటింగ్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేతశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే రూ.148.50 కోట్లు మంజూరు చేయించిన విషయం తెలిసిందే. ఇప్పుడు నిర్మాణ పనులకు మొత్తం రూ.155.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో మార్కెట్ స్వరూపమే మారనుంది. త్వరలోనే టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే సాధ్యమైనంత త్వరలో ఆధునికీకరణ పనులు సైతం చేపట్టనున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మంత్రి 'తుమ్మల' మార్కెట్‌లోనే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 80 వేల బస్తాల సామర్థ్యం కలిగిన శీతల గిడ్డంగిని నిర్మించాలనే యోచన చేశారు. దీంతో మార్కెట్‌కు మిరప పంట తెచ్చినప్పుడు ధర గిట్టుబాటు కాకుంటే ఇక్కడే నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

భక్తుల ఆదరణే శ్రీరామ రక్ష

భద్రాచలం, న్యూస్‌టుడే: 'దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దివ్య క్షేత్రం అభివృద్ధికి భక్తుల ఆదరణే శ్రీరామ రక్షగా నిలుస్తోంది. గత ఏడాది రూ.79 కోట్ల ఆదాయం రాగా ఈ సంవత్సరం రూ.100 కోట్ల రాబడి స్వామివారికి వచ్చేలా ఉద్యోగులు పని చేస్తున్నారని' రామాలయ ఈఓ రమాదేవి పేర్కొన్నారు. పూర్వం నుంచి ఇప్పటి వరకు రూ.లక్ష పైబడి వస్తు, వస్త్ర, ఆభరణ, వాహన, అన్నదానం, వసతి సదుపాయం నిమిత్తం విరాళాలు ఇచ్చిన దాతలను మంగళవారం ఆహ్వానించారు. దర్శనం అనంతరం దాతలకు ఆలయానికి చెందిన మారుతీ సదనంలో ఘన సన్మానం చేశారు. స్వామివారి చిత్ర పటాన్ని అందించి వేదాశీర్వచనం ఇచ్చారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వసతి భోజన సదుపాయం కల్పించారు. ఆలయ వివరాలను ఏవీ రూపంలో తెరపై ప్రదర్శించారు.

★ ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ 'గతంతో పోల్చితే వసతి సౌకర్యాలు మెరుగు పడ్డాయి. ఇంకా 100కు పైగా గదులను కుటీరాలను నిర్మించేందుకు అందరి నుంచి సంపూర్ణ సహకారం కావాలి. ఎంత మంది వచ్చినా అన్నదానం చేయాలని నిర్ణయించాం' అని తెలిపారు. 'రూ.12 లక్షలు చొప్పున భక్తులు ఇచ్చిన రూ.3.60 కోట్ల విరాళంతో 30 గదులున్న జానకీ సదనం ఇటీవల నిర్మించాం. ఇంకా కొన్ని గదుల నిర్మాణం కోసం దాతలు ముందుకు రావాలి. వసతి విభాగం పారిశుద్ధ్య నిర్వహణను ప్రముఖ సంస్థకు అప్పగిస్తున్నాం. భూములు ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. తాగు నీటి కల్పనకు ముఖ్యమైన ప్రాంతాలలో జలప్రసాదం ఏర్పాటు చేశాం. ప్రసాదాల నాణ్యతకు ప్రాధాన్యతను ఇచ్చేందుకు దేవస్థానమే లడ్డూలను తయారు చేస్తోంది. నాణ్యతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం కోసం ప్రయత్నిస్తున్నాం. అనుబంధ ఆలయాలను సైతం అభివృద్ధి చేస్తున్నాం. పర్ణశాలలో ఉచిత ప్రసాదాలతో పాటు ఇక నుంచి ప్రతి శని, ఆదివారాలలో అన్నదానం చేస్తాం. శ్రీరామనవమికి ఇక్కడ నిర్వహించే కల్యాణాన్ని జగమంతా వీక్షిస్తుంది. ఇలాంటి దేవుడి సేవ అదృష్టంగా భావించాలి' అని వివరించారు. 'భక్తులు కోరుకుంటే అన్ని ప్రాంతాలకు రామరథంతో వచ్చి కల్యాణాలను నిర్వహిస్తాం. గిరిజన సంప్రదాయంలో 17న రామాలయంతో పాటు అశ్వారావుపేట మండలం వినాయకపురం సమీపంలో శబరి మాత ఉత్సవాన్ని గిరిజన సంప్రదాయంలో నిర్వహించనున్నామని' తెలిపారు. స్థానాచార్యులు స్థలసాయి మాట్లాడుతూ ఆనాడు భక్త రామదాసు రాములవారికి ఆలయం నిర్మించారని ఆ తర్వాత కాలంలో రాజా తూము లక్ష్మీనరసింహదాసు దీన్ని విస్తరించారని మొదటి నుంచి ఇది భక్తుల ఆదరణతోనే అభివృద్ధి చెందుతోందని వివరించారు. ప్రధానార్చకుడు విజయరాఘవన్, ఏఈఓ భవాని రామకృష్ణారావు, ఈఈ రవీంద్రనాథ్, రామాయణ పారాయణదారు కృష్ణమాచార్యులు, ప్రసాద అవధాని పాల్గొన్నారు.



దాతల సన్మాన సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ రమాదేవి

చదువుల తల్లికి ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: వైద్య విద్యలో సీటు సాధించి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సత్తుపల్లి గుడిపాడులోని నిరుపేద కుటుంబమైన రాజిని ప్రసాద్, నాగమణి దంపతుల కుమార్తె శివభార్గవికి దాతలు అండగా నిలుస్తున్నారు. 'చదువుల తల్లికి సాయమందించరూ' శీర్షికన మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి మానవతావాదులు స్పందించారు. సీఎంఓ కార్యాలయం నుంచి వేణుగోపాల్ సదరు విద్యార్థినికి ఫోన్ చేసి వివరాలడిగి తెలుసుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ ఎ.కల్యాణ్ రూ.50వేలు, జాస్తి ఉమామహేశ్వరరావు రూ.10 వేలు, సాయిరాం రూ.10వేలు, దిలీప్‌రెడ్డి రూ.10 వేలు, మధుసూదన్‌రావు రూ.5వేలు, నిర్మలరాణి రూ.5వేలు, పోలూరి విజయసారథి రూ.3 వేలు, తన్నీరు సత్యనారాయణ, వెంకటేశ్వరమ్మ రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.95 వేలు ఆర్థిక సాయాన్ని ఫోన్ ద్వారా, ఆన్‌లైన్ బదిలీ ద్వారా అందజేశారు. నాలుగేళ్ల చదువుకు రూ.12.5 లక్షలు ఖర్చవుతున్న నేపథ్యంలో సాయమందిస్తామని కొంత మంది ఎన్‌ఆర్‌ఐలు విద్యార్థిని కుటుంబానికి ఫోన్ చేసి చెప్పారు.

రూ.3.50 లక్షల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.3.50 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి మంగళవారం పట్టుకున్నట్లు ఆబ్కారీ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాలు, విశ్వసనీయ సమాచారంతో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం కలిమెల సమీపంలోని మల్కానిగిరికి చెందిన ప్రదీప్ సర్కార్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని పాలగడ్డకు చెందిన ఇంద్రా ద్విచక్ర వాహనంపై రావడంతో ఆపి తనిఖీ చేయగా వారి వాహనంలో గంజాయి లభ్యమైంది. ఒడిశాలో కొనుగోలు చేసి హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వారు వెల్లడించారు. వాహనాన్ని సీజ్‌చేసి నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో కిరణ్, బాలు, సుధీర్, హనుమంతు, హరీష్, విజయ్ పాల్గొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో 10 కిలోలు..

మధిర, న్యూస్‌టుడే: కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయి పొట్లాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం భువనేశ్వర్ నుంచి ముంబయి వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్సైజ్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేశారు. ఓ బోగీలో సుమారు 10 కిలోల బరువున్న నాలుగు గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వీటి రవాణాకు పాల్పడుతున్న వారి ఆచూకీ తెలియకపోవడంతో ఎక్సైజ్ సీఐ కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

★ మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలను పాడుచేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ రామ్మూర్తి సూచించారు. మధిర మున్సిపాలిటీలోని జిలుగుమాడులో ఉన్న డ్రగ్ రీహ్యాబిలిటేషన్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు దుర్మరణం



నరేశ్



సారయ్య



నాగరాజు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవడంతో రహదారులు నెత్తురోడాయి. డివైడర్‌ను ఢీకొని ఇద్దరు మృతి చెందగా, బస్సు ఢీకొని మరో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. బూర్గంపాడు మండలం సొంపల్లి పంచాయతీ బుడ్డగూడెం గ్రామానికి చెందిన సొడే నరేశ్(34) తన బంధువైన సారయ్య(28)తో కలిసి పాల్వంచకు వచ్చారు. ఓ పని గురించి మాట్లాడుకుని తిరిగి వెళ్తున్న క్రమంలో లక్ష్మీదేవిపల్లి(ఎస్) సమీపంలో విభాగిణిని ఢీకొట్టారు. నరేశ్ అక్కడిక్కడే మృతి చెందగా, సారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పాల్వంచ ఏరియా ఆసుపత్రికి తీసుకొస్తుండటంతో మార్గంమధ్యలో మృతి చెందారు. నరేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కాగా సారయ్య అవివాహితుడు. లక్ష్మీదేవిపల్లి(ఎస్) సాయిబాబా గుడి వద్ద నివాసం ఉంటున్న నాగరాజు(40) సమీపంలో ద్విచక్రవాహన ప్రమాదం చోటు చేసుకోవడంతో చూడటానికి వచ్చారు. అనంతరం రహదారి దాటే క్రమంలో బస్సు ఢీకొని మృతి చెందారు. భార్యతో పాటు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఇద్దరు 'పది' విద్యార్థులు..



రేవంత్ రాజు



మురళీ కృష్ణ

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం సుబ్బంపేట వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందారు. మరో విద్యార్థి పాక్షిక గాయాలతో బయటపడ్డాడు. మండల పరిధిలోని జీపీపల్లికి చెందిన ఎంబటి మురళీకృష్ణ(16), చర్లకు చెందిన చింతలపూడి రేవంత్‌రాజ్(15), లింగాపురంపాడుకు చెందిన యాకూబ్‌లు కలిసి ఎదురుగుట్టల వైపు నుంచి చర్లకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు విద్యార్థులు చర్లలో పదో తరగతి చదువుతున్నారు. ద్విచక్ర వాహనంపై వస్తూ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వచ్చిన లారీ కింద పడిపోవడంతో రేవంత్‌రాజ్, మురళీకృష్ణలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం నుంచి యాకూబ్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి యువకుడు..

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: చెరువులో పడి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగాపురం తండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాకు చెందిన ధనావత్ రామదాసు-లక్ష్మిలకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్దవాడైన ధనావత్ గోపి(16) ఇంటర్ ప్రథమ సంవత్సరం స్థానిక నేలకొండపల్లిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఈ మేరకు మంగళవారం తన స్నేహితులతో కలిసి మంగాపురం తండా శివారులో ఉన్న చెరువు మాదారానికి చెందిన చెరువులోకి ఈత కొట్టేందుకు వెళ్లారు. ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. తోటి స్నేహితులు భయంతో బయటికి వచ్చి జరిగిన విషయాన్ని తండావాసులకు తెలిపారు. నీటిలో మూర్ఛ వచ్చి మునిగిపోయి ఉంటాడని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి, కేసు దర్యాప్తు చేపట్టారు.

గుంతల్లో బైకు అదుపుతప్పి..

మణుగూరు, న్యూస్‌టుడే: మణుగూరు-తిర్లాపురం రహదారిపై సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ సతీశ్ తెలిపిన వివరాలు.. ఇసుక లారీల రాకపోకల నేపథ్యంలో రహదారిపై పెద్దపెద్ద గోతులు పడ్డాయి. ఆ మార్గంలో మునగల రవికుమార్(47) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ప్రధాన రహదారిపై ఉన్న గోతిలోకి ద్విచక్ర వాహనం వెళ్లడంతో కిందపడిపోయాడు. తీవ్రగాయాలపాలైన ఆయనను ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయాడు. సీఐ సతీశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,500	7,000	6,700
పాతపత్తి	7,200	7,300	7,275
పెసలు	4,000	7,200	6,800
ఏసీ ఎండుమిరప	10,000	19,500	17,500
ఏసీతాలుమిరప	9,000	9,600	9,100
ఎండుమిరప	6,000	17,000	16,500
తాలుమిరప	6,000	7,000	6,500
మొక్కజొన్నలు	2,050	2,050	2,050

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

ఖడ్గమాల సేవలో నందిని

మధిర, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ మల్లు నందిని దుర్గాదేవి ఖడ్గమాల సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాలతో నందినిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. పట్టు వస్త్రాలు అందజేశారు.



నందినికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ అధికారులు

ఎరువుల డీలర్లకు అవగాహన

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ రైతు వేదికలో వ్యవసాయ శాఖ, క్రిబ్‌కో ఎరువుల కంపెనీ ఆధ్వర్యంలో సత్తుపల్లి, మధిర ఎరువుల డీలర్లకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సత్తుపల్లి ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి డీలరు ఎరువుల అమ్మకాలను పీఓఎస్ మిషన్ ద్వారానే చేపట్టాలని సూచించారు. ఏఓ తాజుద్దీన్, క్రిబ్‌కో సిబ్బంది ఎన్.మునిరెడ్డి, వి.నాగరాజు పాల్గొన్నారు.

సమస్య: ఎల్ఐసీ కార్యాలయం వెనక వీధిలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలి. వంకాయలపాటి వంటి, మధిర

సమాధానం: చెత్తను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే చర్యలు తీసుకుంటాం. **షఫీఉల్లా, కమిషనర్**

శ్రీనగర్ కాలనీ 4వ లైన్‌లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. రాత్రివేళల్లో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. **మచ్చా నాగేశ్వరరావు, స్థానికుడు**

✔ నాలుగు రోజుల్లో పిచ్చి మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. **షఫీఉల్లా, కమిషనర్**

మధిర మున్సిపాలిటీలోని 18వ వార్డు లడక్‌వీధి చివర్లోని తారు రోడ్డు వెంట రోడ్లో వారానికోరోజు మాత్రమే తాగునీరు అందిస్తున్నారు. గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

- మటూరి రాజా, డాక్టర్ అనంతయ్య

✔ సాంకేతిక లోపాన్ని సరిచేసి రోజు విడిచి రోజు తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. **నరేష్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ**

- మధిర, న్యూస్‌టుడే

కారేపల్లి అడ్డరోడ్డు, ఆబ్కారీ స్టేషన్ సమీపంలో రహదారి బురదమయంగా మారడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- స్థానికుడు

✔ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.

- శ్రావణి, పంచాయతీ కార్యదర్శి

- కారేపల్లి, న్యూస్‌టుడే

చివరి మజిలీకి ఎంతకష్టమో..

ఏన్కూరు, న్యూస్‌టుడే

ఏన్కూరులో వైకుంఠధామం వెళ్లే దారి ముళ్లపొదలతో మూసుకుపోయింది. బొడ్డాయి కూడలి నుంచి వైకుంఠధామం వరకు వెళ్లే డొంకదారిలో ఏపుగా ముళ్లపొదలు పెరిగిపోయాయి. వర్షాకాలం మొదలైన తరువాత వైకుంఠధామం అధ్వానంగా ఉంటోంది. శ్మశానవాటిక స్థలం విడిచిపెట్టిన ఆరుబయట అంతా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు పెరిగిపోయాయి. ఎంపీడీవో రమేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా రెండుచోట్ల ముళ్లపొదలు తొలగిస్తామన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ మండలం రామచంద్రాపురంలోని వైకుంఠధామం పిచ్చిమొక్కలు, కంప చెట్లతో అధ్వానంగా మారింది. గ్రామంలో ఎవరైనా చనిపోయిన సందర్భంలో వైకుంఠధామంలోకి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై తల్లాడ ఎంపీఓ కె.శ్రీదేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వైకుంఠధామంలోని పిచ్చిమొక్కలు, కంప చెట్లను తొలగించి శుభ్రం చేస్తామన్నారు.



ఏన్కూరు: ముళ్లపొదలతో మూసుకుపోయిన రహదారి



పిచ్చిమొక్కలు పెరిగిన రామచంద్రాపురం వైకుంఠధామం

ప్రమాదపుటంచున ఆటలు..!

రేపల్లెవాడ గ్రామంలోని ఇళ్ల మధ్యలో ఓ విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉన్నా అది కారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఊరి మధ్యలో ఉండే ఈ నియంత్రిక సమీపంలో నిత్యం రోజుల్లో చిన్నారులు ప్రమాదకరంగా ఆడిపాడుతున్నారు. జనావాసానికి దూరంగా దీన్ని ఏర్పాటు చేయాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. మూడేళ్లనాడు అంచనా రూపొందించి ఆ తర్వాత విస్మరించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ వెంకన్న 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచుతామన్నారు.

- చింతకాని, న్యూస్‌టుడే



నిన్నటి కారు డ్రైవరే.. నేటి ఉపాధ్యాయుడు

వైరా, న్యూస్‌టుడే

డిగ్రీ, బీఈడీ పూర్తి చేసి పదేళ్లు దాటింది. ఉపాధి కోసం తొలుత ట్రాక్టర్, ఆ తర్వాత కారు డ్రైవర్‌గా పని చేసిన ఆ యువకుణ్ని తాజాగా ఉపాధ్యాయ కొలువు వరించింది. వైరా మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన జి.నాగసైదులు పేద కుటుంబం. చదువుపై ఇతని ఆసక్తి గుర్తించి కొందరు ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు ప్రోత్సహించారు. బీకామ్, బీఈడీ చేసిన ఆతను గురుకుల పోస్టులకు ప్రయత్నించిన పట్టికే త్రుటిలో అవకాశం కోల్పోయారు. కారు డ్రైవర్‌గా పనిచేస్తూ దూర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాలకు బాడుగకు వెళ్లిన క్రమంలో ఖాళీ సమయాన్ని చదువుకునే సమయంగా మార్చుకున్నాడు. కారులో పుస్తకాలను తన వెంట తీసుకెళ్లి పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో సోషల్ విభాగంలో స్కూల్ అసిస్టెంట్ సాధించారు. తన గురువులు, మిత్రులు అందించిన ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించినట్లు నాగసైదులు తెలిపారు.



సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ బదిలీ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న మోజెస్ జాన్సన్ ఇన్‌ఛార్జి(డీఆర్) విధానంలో మేడ్చల్ జిల్లా ఉప్పల్‌కు మంగళవారం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్తుపల్లికి ఇంకా ఎవరినీ కేటాయించలేదు.

'పూర్తి స్థాయిలో అమలుకాని రుణమాఫీ'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రుణమాఫీ పథకం రాష్ట్రంలో ఎక్కడా పూర్తిస్థాయిలో అమలు కాలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొక్కా వీరభద్రం అన్నారు. సిరిగి రావి వీరవెంకయ్య భవనంలో మంగళవారం ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతూ సగం మందికి కూడా రుణ మాఫీ లబ్ధి దక్కలేదన్నారు. సమావేశంలో రావుల రాజబాబు, మాదినేని రమేశ్, మోరంపూడి పాండు, కొలికపోగు సర్వేశ్వరరావు, వెంకటరావు పాల్గొన్నారు.

'కార్మిక సంక్షేమ బోర్డు ప్రైవేటీకరణ తగదు'

వేంసూరు, న్యూస్‌టుడే: పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం తగదని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మీనారాయణ కోరారు. సీపీఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ అధ్యక్షతన మంగళవారం మర్లపాడులో నిర్వహించిన మండల మెయింటెన్ సంఘం సమావేశంలో మాట్లాడారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మతూరు రామకృష్ణ, వ్యకాసం తడికమళ్ల యోబు, హౌస్ పెయింటింగ్ వర్కర్ల డివిజన్ నాయకులు సత్తార్, రవి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

వైరా, న్యూస్‌టుడే: గుంటూరులో జరుగుతున్న సౌత్ నేషనల్ అథ్లెటిక్ రన్నింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని మడిపల్లి మనీషాకు దాతలు చేయూత అందించారు. కౌన్సిలర్ మాదినేని సునీత, ప్రసాద్ దంపతులు రూ.5 వేలు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు చొరవతో క్లబ్ పార్టీ నుంచి రూ.20 వేలను మంగళవారం అందించారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ, అబ్బూరి రమేశ్, ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్, రామ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న క్లబ్ బాధ్యులు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

కొణిజర్ల, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా నాయకురాలు సౌందర్య మంగళవారం పంపిణీ చేశారు. ఆ గ్రామానికి చెందిన చేకూరి సరోజిని రూ.55 వేలు, వీరయ్య రూ.24 వేలు సహాయనిధి చెక్కులు మంజూరవగా వాటిని అందించారు.

బదిలీపై వెళ్తున్న ఏఈకి సన్మానం

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ కాలంలో ప్రజలకు చేసిన సేవలు గుర్తుండిపోతాయని వైరా డీఈ హీరాలాల్ పేర్కొన్నారు. మంగళవారం గ్రామీణ ఏఈగా సుదీర్ఘకాలం పనిచేసి బదిలీపై వెళ్తున్న ఏఈ నాగేశ్వరరావును సిరిపురం సబ్ స్టేషన్‌లో గ్రామీణ సిబ్బంది సన్మానించారు. ఏడీఈ అనురాధ పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపాకు పట్టం కట్టాలి'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపాకు పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కన్వీనర్ ఈవీ రమేశ్ అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఫామ్ 19-బి, సర్వీస్ సర్టిఫికెట్ ఫార్మాట్‌లను అందజేశారు. మండల కన్వీనర్లు పాలకొల్లు శ్రీనివాస్, అచంట నాగస్వామి, నాయుడు రామారావు, మట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

'ఓటు నమోదు చేసుకోవాలి'

వేంసూరు, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యాయులు, అధ్యాపకులందరూ నవంబరు 6వ తేదీలోగా ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దమ్మలపాటి వివేకమూర్తి కోరారు. పాత జాబితా ఉండదని, అర్హులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

'పేదలందరికీ ఇళ్లు కేటాయించండి'

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: పేదలందరికీ ఇళ్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. భీమవరం గ్రామంలో మంగళవారం మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని, గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బండి రమేశ్, కోటేశ్వరరావు, డి.వీరయ్య, జి.కోటేశ్వరరావు, ఎన్.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం

తాగునీటి సరఫరాపై శిక్షణ

ముదిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని ఎంపీడబ్ల్యూలకు తాగునీటి సరఫరాపై మంగళవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ముదిగొండలోని రైతువేదికలో నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిశోర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్‌రావు, ఏఈ విజయరాజు పాల్గొన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: మల్లవరం రైతు వేదికలో మంచినీటి సహాయకులకు మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జయలక్ష్మి, తల్లాడ ఏఈ సింధు ప్రారంభించారు. ఈ నెల 18వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. ఏఈలు పాల్గొన్నారు.

జాతరలో సందడే.. సందడి

కారేపల్లి, న్యూస్‌టుడే: కోటమైసమ్మ జాతర నాలుగో రోజు మంగళవారం మమ్మరంగా సాగింది. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దుకాణాలు, వినోద ప్రాంగణాల వద్ద భక్తులు సందడిగా గడిపారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సోమవారం రాత్రి సీఎం పీఆర్వో దూదిపాళ్ల విజయ్ దంపతులు జాతరను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో వేణుగోపాలాచార్యులు, ఛైర్మన్ పర్సా పట్టాభి రామారావు, సీఈ తిరుపతిరెడ్డి, ఎస్సై రాజారామ్ పాల్గొన్నారు.



వినోద ప్రాంగణాల వద్ద భక్తులు

తల్లాడలో అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణ

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడలోని గౌడబజారులో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. అర్చకులు కంచెల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, భాజపా నేత తాండ్ర వినోద్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, తెలంగాణ హిందూ ధర్మసేన కన్వీనర్ సుదర్శన్ ప్రసాద్ తివారీ తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. భాజపా మండల అధ్యక్షుడు ఉపతి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.



అభయాంజనేయస్వామి విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మట్టా రాగమయి

ఖమ్మం జిల్లాలోకి క్రీడా జ్యోతి ప్రవేశం

ఏన్కూరు, కొణిజర్ల, న్యూస్‌టుడే: యువకులు, విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని చాటే విధంగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సీఎం కప్ క్రీడా జ్యోతి యాత్ర మంగళవారం ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు నుంచి ఏన్కూరు మండలం హిమాంనగర్ వద్ద జిల్లా సరిహద్దుకు చేరుకున్న క్రీడాజ్యోతి యాత్రకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. జిల్లా క్రీడల అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి, వాలీబాల్ కోచ్ అలీగౌస్ క్రీడాజ్యోతిని అందుకున్నారు. ఏన్కూరు గురుకుల విద్యాలయం వద్ద మండల అధికారులు, విద్యార్థులు మువ్వన్నెల జెండాలతో ఆహ్వానించారు. అక్కడ నుంచి జాతీయ జెండాలు, క్రీడా వందనాలతో రెండు కి.మీటర్లు బారున జన్నారం క్రాస్‌రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధానంగా జానపద బృందం పాటల పాడుతూ అలరించారు. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో ఎస్.రమేశ్, కళాశాల ప్రధానాచార్యులు ఎం.సింహాచలం, హెచ్ఎంలు కూరాకుల సైదయ్య, ఇంద్రారెడ్డి, రమేశ్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పీఈటీలు, గ్రామస్థులు పాల్గొన్నారు. ✦ సీఎం కప్-2024లో భాగంగా కొణిజర్ల మండలానికి చేరిన క్రీడాజ్యోతికి అధికారులు మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో రోజారాణి, ఎస్సై సూరజ్ క్రీడాజ్యోతి పట్టుకుని ర్యాలీని ప్రారంభించారు.



ఏన్కూరులో క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

'ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు'

ముదిగొండ, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సునీత ఎలిజబెత్ హెచ్చరించారు. పెద్దమండవ, గంధసిరి పరిధిలో మున్నేరులోకి ఇసుక ట్రాక్టర్లు వెళ్లకుండా మంగళవారం జేసీబీల సాయంతో కందకాలు తవ్వించారు. ఎస్ఐలు నరేశ్, రోహిత్, ఆర్ఐలు ప్రసన్నకుమార్, వహీదాలు పాల్గొన్నారు.



పెద్దమండవలో జేసీబీతో కందకం తవ్విస్తున్న తహసీల్దార్, ఎస్ఐలు

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఏ ప్రాంతం నుంచైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని గ్రామీణ ఎస్సై లక్ష్మీభార్గవి ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇసుకతో పట్టుబడితే కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు.

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

కల్లూరు, న్యూస్‌టుడే: పట్టణ పరిధిలోని పుల్లయ్యబంజరలో మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కల్లూరు ఏసీపీ రఘు, తహసీల్దార్ పులి సాంబశివుడు, సత్తుపల్లి గ్రామీణ సీఐ ముత్తు లింగయ్య, ఎస్ఐ హరితలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 20 రోజుల క్రితమే సదరు మహిళ మృతి చెందినట్లు తెలుస్తోందని ఏసీపీ తెలిపారు. పెనుబల్లి వైద్యశాలలో శవపరీక్షల అనంతరం కేసు నమోదు చేసినట్లు వివరించారు. పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

బోనకల్లు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం వెనకనుంచి వచ్చి ఢీకొన్న ఘటనలో ఓ పాదచారి తీవ్రంగా గాయపడ్డాడు. చేబ్రోలు జనార్దన్ అనే వ్యక్తి మంగళవారం రాత్రి రావినూతల నుంచి బోనకల్లు వెళ్తున్నాడు. కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన కంచపోగు శ్రీకాంత్ రావినూతల పాఠశాల సమీపంలో బైక్‌పై వచ్చి వెనకనుంచి ఢీకొట్టాడు. బాధితుని బోనకల్లు పీహెచ్‌సీకి తరలించారు. బైక్‌లో నుంచి రెండు మద్యం సీసాలు జారిపడ్డాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో జీవాలు మృతి

ముదిగొండ, న్యూస్‌టుడే: కొత్తలక్ష్మీపురంలో గుండెల వెంకటేశ్వర్లుకు చెందిన ఆయిదు జీవాలు మంగళవారం శునకాల దాడిలో మృత్యువాత పడ్డాయి.

ట్రాక్టర్ ట్రక్కును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు కిష్టారం కోసీ సమీపంలో ఆయిల్‌పామ్ గెలలతో వస్తున్న ట్రాక్టర్ ట్రక్కును వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదంలో ఆయిల్‌పామ్ గెలలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. బస్సు ముందు భాగం దెబ్బతింది. ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

సొసైటీ మాజీ ఛైర్మన్‌కు నివాళి

మధిర గ్రామీణం: సిద్ధినేనిగూడెం సొసైటీ మాజీ ఛైర్మన్ గుర్రాల పుల్లారెడ్డి (74) మంగళవారం మృతి చెందారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సూరంశెట్టి కిశోర్, మాజీ ఎంపీపీ ఛైర్మన్ హన్మంతరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్నాటి రామారావు, నిడమాల వంశీకృష్ణ, పులిబండ్ల చిట్టిబాబు తదితరులు ఆయనకు నివాళి అర్పించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

మధిర, న్యూస్‌టుడే: మడుపల్లిలో కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకుని ప్లాట్లు చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ కోరారు. మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ కిశోర్‌కి వినతిపత్రాన్ని మంగళవారం అందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చింతకాని, న్యూస్‌టుడే: నాగులవంచ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ నల్లమోతు శేషగిరిరావు మంగళవారం ప్రారంభించారు. సీఈఓ శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వేంసూరు, న్యూస్‌టుడే: భీమవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం పరిశీలించారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



చింతకాని: కొనుగోలు కేంద్ర ప్రారంభ కార్యక్రమం

చలమాల వర్ధంతి

పెనుబల్లి, న్యూస్‌టుడే: నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సీపీఎం నాయకుడు చలమాల సూర్యనారాయణ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఆ పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు బొక్కా వీరభద్రం అన్నారు. మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన వీఎం బంజరులోని పార్టీ కార్యాలయంలో చలమాల వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేశ్, కాటేనేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి: అదనపు కలెక్టర్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. సత్తుపల్లిలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రక్త పరీక్ష కేంద్రం, క్యాజువాలిటీ, డ్రగ్‌స్టోర్, రక్తశుద్ధి కేంద్రం, పురుషుల, మహిళల వార్డులను పరిశీలించారు. రోగులకిచ్చే వైద్యసేవల అందుతున్న తీరును తెలుసుకున్నారు. భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగారు. సీమాంక్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ఆసుపత్రిలోని విభాగాలకు సంబంధించిన రికార్డులు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. పక్కనే నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని పరిశీలించారు. గంగారం పీహెచ్‌సీని సందర్శించి ఓపీ, వార్డుల వివరాలు ఆరాతీశారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డి.సీతారాం, సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు సురేశ్‌నారాయణ, ప్రణయ్, జయలక్ష్మి, రాజేశ్, సాంబశివరావు, సాత్విక్, నారాయణమ్మ, ప్రేమలత, గ్రీష్మ, పుష్ప పాల్గొన్నారు.

చేయూత

వైరా, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కాలనీకి చెందిన కుక్కల బాబుకు మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాబుకు బియ్యంతో పాటు ఇతర నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గుడిమెట్ల రజిత, సభ్యులు రోషన్, ఆదారి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు నివాళి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం సత్తుపల్లిలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి హైస్కూల్ హెచ్ఎం యాకూబ్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావుతోపాటు 1985-86 పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపల్ వాసిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. కలాం విగ్రహానికి ప్రిన్సిపల్, అధ్యాపకులు నివాళులర్పించారు. ముదిగొండ పాఠశాల హెచ్ఎం శాంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రుల ఆకస్మిక తనిఖీ

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణంలో ఒకే ఆవరణలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక వైద్యశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలల్లోని రికార్డులు, మందుల వివరాలను పరిశీలించారు. వైద్యశాల పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. నూతనంగా చేపట్టిన సీహెచ్‌సీ భవన నిర్మాణ పనుల పురోగతిని వైద్యాధికారి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ భవనం స్థానంలో నూతనంగా నిర్మించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నవ్యకాంత్ అడగ్గా పరిశీలిస్తామన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలోని మందుల స్టోర్ రూంలో రికార్డులు పరిశీలిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ

కార్మిక సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయూసీ లక్ష్యం

సత్తుపల్లి, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారమే ఐఎన్‌టీయూసీ లక్ష్యమని రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి, మండలి ఛైర్మన్, ఆ సంఘం జనరల్ సెక్రెటరీ జనక్ ప్రసాద్ అన్నారు. స్థానిక జేవీఆర్ ఓసీలో పిట్ సెక్రటరీ రామారావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వ సహకారంతో నెరవేరుస్తామని, ఐటీ మాఫీ, సొంత ఇంటి పథకంపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి సాకారం చేస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లాభాల్లో ఒప్పంద కార్మికులకు రూ.5వేలు ఇచ్చి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని చెప్పారు. కాంట్రాక్ట్, కోల్ సార్టింగ్ కార్మికుల జనక్‌ప్రసాద్‌ను గజమాలతో సత్కరించారు. ఏరియా జీఎం షాలేంరాజు, ఆర్.ఎస్.నాయుడు, నాయకులు పాల్గొన్నారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్, సాగర్, నరసింహారెడ్డి, త్యాగరాజన్, విజయ్‌కుమార్, అల్లూర్, నాగభూషణం, లక్ష్మణ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



జనక్ ప్రసాద్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్మికులు

'దేశ హితం కోసం భాజపాలో చేరండి'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: దేశ హితం కోసం ప్రజలు భాజపాలో చేరాలని ఆ పార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, జిల్లా నాయకుడు తాండ్ర వినోద్‌రావులు కోరారు. సత్తుపల్లిలో మంగళవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యాపారులు, దుకాణదారులను కలుసుకుని సభ్యత్వాలు చేయించారు. మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్తోందన్నారు. నాయకులు అచంట నాగస్వామి, సుదర్శన్‌మిశ్రా, రామకృష్ణ, వసంతరావు, నాగరాజు, శివ పాల్గొన్నారు. తల్లాడ, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వం సీటు సాధించిన విద్యార్థులకు తల్లాడకు చెందిన అక్రబ్రీవల్లిని మంగళవారం భాజపా నాయకులు తాండ్ర వినోద్‌రావు, నంబూరి రామలింగేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సుదర్శన్ ప్రసాద్ తివారీ శాలువాతో సత్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉపతి వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: సభ్యత్వ నమోదులో పాల్గొన్న భాజపా జిల్లా నాయకులు తాండ్ర, నంబూరి

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

పీఆర్వో పోస్టుకు పైరవీలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలకంలో వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన నియమితులైన కొంతమంది వ్యక్తులు కీలక పోస్టుల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించడం సర్వసాధారణంగా మారింది. ఇప్పటికే పొరుగుసేవల కార్మికులుగా నియమితులైన 20 మందికిపైగా సిబ్బంది రెవెన్యూ, పారిశుద్ధ్యం, ప్రణాళిక ఇతర విభాగాల్లో, మరికొందరు అధికారులకు సహాయకులుగా పని చేస్తున్నారు. పాలకవర్గం అనుమతి లేకుండా ప్రణాళిక విభాగంలో పని చేస్తున్న పలువురికి ఐదు నెలలుగా వేతనాలు సైతం చెల్లించడం లేదు. ఇదే సమయంలో కొంతమంది తమను పీఆర్వోగా నియమించుకోవాలని నేతల ద్వారా ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడం నగరపాలకంలో చర్చనీయాంశంగా మారింది.

దుకాణాల వేలం వాయిదా

కామేపల్లి, న్యూస్‌టుడే: కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయ దుకాణాల నిర్వహణకు సంబంధించి దేవాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం పాట మంగళవారం ఏర్పాటు చేశారు. వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో అధికారులు రెండోసారి వాయిదా వేశారు. హుండీ ఆదాయం రూ.35,421, దసరా పండగ రోజున పూజ టికెట్లపై 13,850 ఆదాయం వచ్చిందని ఈవో శేషయ్య తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: వీడీఓస్ కాలనీ భారత్ గ్యాస్ ఏజెన్సీ వెనుక వీధిలోని ఖాళీ స్థలంలో చెత్త వేయకపోయింది. ఇతర ప్రాంతాల్లో చెత్త తెచ్చి అక్కడ వేస్తున్నారు. - వీరభద్రాచారి, స్థానికుడు

సమాధానం: పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - సంపత్‌కుమార్, సహాయ కమిషనర్ ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి: మంత్రి



బల్లేపల్లి చెరువులో చేప పిల్లలు పోస్తున్న మంత్రి తుమ్మల. చిత్రంలో మేయర్ నీరజ తదితరులు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, నీలి విప్లవం సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగర శివారు బాలపేట, రఘునాథపాలెం మండలం హర్యాతండా, బద్యాతండా, రాంక్యాతండా గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. బల్లేపల్లి చెరువులో ఉచితంగా చేపపిల్లలను వదిలే కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలో 212 మత్స్య సహకార సంఘాల పరిధిలో 310 చెరువులున్నాయన్నారు. రూ.150 కోట్లతో 60 లక్షల చేప పిల్లలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. బాలపేటతండా నుంచి చెరువు కట్ట మీదుగా ఇల్లెందు రోడ్డు వరకు రహదారిని అభివృద్ధి చేస్తామన్నారు. రఘునాథపాలెం మండలం హర్యాతండా, బద్యాతండా, రాంక్యాతండా గ్రామాల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మానుకొండ రాధాకిశోర్, మత్స్య శాఖ ఏడీ శివప్రసాద్, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, మత్స్య సంఘం జిల్లా అడహాక్ కమిటీ ఛైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు, బల్లేపల్లి మత్స్య సంఘం అధ్యక్షుడు గోమసు నాగేశ్వరరావు, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రాధమ్మకు నివాళి: సారధినగర్, న్యూస్‌టుడే: పెద్దతండాకు చెందిన చల్లపల్లి శ్రీనివాస్ మాతృమూర్తి దివంగత రాధమ్మ చిత్రపటం వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం నివాళి అర్పించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రమేష్‌రెడ్డి, సైదుబాబు, ఎలిగొండ స్వామి మంత్రి వెంట ఉన్నారు.

షాదీఖానా ఆధునికీకరణకు రూ.50 లక్షలు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: షాదీఖానా ఆధునికీకరణకు రూ.50 లక్షలు మంజూరు చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఖమ్మం షాదీఖానాలో మంగళవారం ఖమ్మం నియోజకవర్గంలోని 63 మసీదుల మరమ్మతులకు రూ.1 లక్ష చొప్పున మంజూరైన నిధుల చెక్కులను నిర్వాహకులకు అందజేశారు. డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహ్రా, మైనార్టీ సంక్షేమాధికారి సత్యనారాయణ, ఆరిఫ్, ఖాదర్‌బాబా, ముక్తార్, హుస్సేన్, చోటాబాబా, మసీదు కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

జనం చెంతకు పరిపాలన

నగరంలో సర్కిళ్ల ఏర్పాటుకు కసరత్తు



నగరపాలక సంస్థ కార్యాలయం

నగర జనాభా: సుమారు 4.20 లక్షలు
ప్రస్తుత డివిజన్లు: 60
విభాగాలు: పారిశుద్ధ్యం, రెవెన్యూ ఇంజినీరింగ్, మంచినీటి సరఫరా
ప్రతిపాదించిన సర్కిల్స్: ఆరు

ప్రతిపాదిత ప్రాంతాలు: ఎన్‌టీఆర్ సర్కిల్, మమతరోడ్, ముస్తఫానగర్, గాంధీచౌక్, నయాబజార్, కొత్త నగరపాలక సంస్థ కార్యాలయం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఖమ్మం నగరపాలక సంస్థలో పరిపాలన సౌలభ్యం.. ప్రజలకు తక్షణ సేవలు అందించడంతో పాటు, దూర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో పౌరసేవలు ఉండాలన్న లక్ష్యంతో సర్కిళ్ల ఏర్పాటు చేసేందుకు అవసరమైన కసరత్తు ప్రారంభించారు. నగరపాలక సంస్థగా మారి, తొలి పాలకవర్గం ఏర్పడిన సమయంలో దీనిపై కసరత్తు మొదలుపెట్టినా అది ఆచరణలోకి రాలేదు. మళ్లీ 13 సంవత్సరాల తరువాత ఈ విషయం తెరపైకి వచ్చింది. 15 రోజుల కిందట దీనికి సంబంధించి నగరపాలక సంస్థ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల సిబ్బంది కమిషనర్, సహాయ కమిషనర్లతో చర్చించారు. అనంతరం ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసే సర్కిల్ కార్యాలయాలకు అవసరమైన భవనాలు, స్థలాలు అందుబాటులో ఉన్నాయా? అన్న విషయాన్ని పరిశీలించేందుకు ప్రణాళిక విభాగం చర్యలు చేపట్టింది.

సర్కిల్స్ ఎందుకంటే...

నగరపాలక సంస్థలో విలీనమైన వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలు చెప్పుకొనేందుకు కార్యాలయానికి రావడం కష్టంగా ఉంది. ఆయా డివిజన్ల అధికారులతో సర్కిల్ కార్యాలయంలో వాటిని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా ఇంటి పన్ను, పంపు పన్ను చెల్లింపులు, ట్రేడ్ లైసెన్సుల మంజూరు, కొత్త ఇళ్లకు నెంబర్ కేటాయింపు, ఆస్తి మార్పిడి, కొత్త పంపు కనెక్షన్లు వంటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. తద్వారా ఆయా డివిజన్ల ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

10 డివిజన్లకు ఒకటి చొప్పున..

ఖమ్మం నగరపాలకంలో ప్రస్తుతం 60 డివిజన్లు ఉండగా ప్రతి 10 డివిజన్లకు ఒక సర్కిల్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తద్వారా నగరపాలకంలో ఆరు సర్కిళ్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల్లో నగరపాలక సంస్థకు చెందిన భవనాలు ఉంటే వాటిని వినియోగించుకోవడం, లేని పక్షంలో స్థలాలు ఉంటే వాటిలో అవసరమైన భవన నిర్మాణాలు చేపట్టాలన్న కసరత్తు ప్రారంభించారు. ప్రతిపాదిత సర్కిల్ కార్యాలయాల్లో ఆ పది డివిజన్లకు చెందిన నగరపాలక సంస్థ సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఓ అధికారి వెల్లడించారు.

అర్బన్ తహసీల్దారుగా రవికుమార్



ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: ఖమ్మం అర్బన్ తహసీల్దారుగా వి.రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. తల్లాడలో పని చేస్తున్న ఆయనను అర్బన్‌కు కేటాయిస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న ఉప తహసీల్దారు ఎస్.కల్పన నుంచి రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. సకాలంలో ధ్రువీకరణ పత్రం ఇవ్వక తాను ఉద్యోగ అవకాశం కోల్పోయానంటూ ఇటీవల వరకు తహసీల్దారుగా పని చేసిన టి.స్వామిపై ఓ మహిళా నిరుద్యోగి గత సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు స్వామిని కలెక్టరేటుకు సరెండర్ చేయడంతో ఎన్నికల ఉప తహసీల్దారు కల్పన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి: సీపీఎం

కూసుమంచి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా అమలులోకి తేలేదని కూసుమంచిలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో గుర్తు చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసి పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందన్నారు. ప్రతీ రైతు రుణాన్ని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జి బండి రమేష్, మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, పార్టీ నాయకులు గురుమూర్తి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కోసం దీక్ష

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పాత్రికేయుడు సంతోష్‌కుమార్ చేపట్టిన నిరాహారదీక్ష రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం పలువురు పాత్రికేయులు, వివిధ సంఘాల ప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు.

భగీరథ యత్నం నీరుగారుతోంది!



మిషన్ భగీరథ నీరు పొంగిపొర్లుతోంది. నగరంలోని ఎన్నెస్పీ ప్రాంగణంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రోడ్డు పక్కనే మిషన్ భగీరథ పంపు ఉంది. నీరు వృథాగా పోతోంది. ఇప్పటికే ఈ ప్రాంగణమంతా ఈ నీటితో చిత్తడిగా మారింది. ఇటీవల ఇక్కడ పోలీసుశాఖకు సంబంధించిన కార్యాలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో పైపు నలిగి ఉంటుందని ఇక్కడి స్థానికులు చెబుతున్నారు. ఏదేమైనా తాగునీరు ఇలా నేలపాలవుతుంటే ఇక్కడున్న వారు కూడా గమనించడం లేదు. – ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే

తీరిన గుంత చింత!



ఖమ్మం-కామంచికల్లు ప్రధాన రహదారి చెంత దానవాయిగూడెం వద్ద గుంత పూడ్చక వాహనదారులు పడుతున్న ఇబ్బందులను ఓ ఆటో డ్రైవర్ మానవత్వంతో స్పందించి పరిష్కరించారు. ఈ గుంత కారణంగా తరచూ వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో రామన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్ సైదాపేట వెంకటేశ్ సొంత ఖర్చులతో మట్టి, రాళ్లు తోలించి మంగళవారం గుంతని పూడ్పించి అందరి మన్ననలు అందుకున్నారు. – రఘునాథపాలెం, న్యూస్‌టుడే

మహిళా క్రికెటర్ల వినతి

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: 'దశాబ్దాలుగా క్రికెట్ రంగంలో ఉన్నాం. పది నుంచి 15 సార్లు ప్రతిష్ఠాత్మక లీగ్ మ్యాచుల్లో రాణించాం. మాకు తగిన ఉద్యోగాలు కల్పించాల'ని సీనియర్ మహిళా క్రికెటర్లు మంగళవారం శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. మహిళా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆయనను కలిసిన మహిళా క్రికెటర్ల బృందం ఓ జ్ఞాపిక అందించారు. శాలువాతో సత్కరించారు. అనంతరం తమ సమస్యలు చెప్పి తగిన ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కోచ్‌లుగా పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు క్రీడాకారిణులు వివరించారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి: డీపీఓ



మాట్లాడుతున్న డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ రాంబాబు

ఖమ్మం నగరం: పల్లెల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. ఖమ్మంలోని డీపీఆర్సీ భవనంలో సింగరేణి, కామేపల్లి, వైరా, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీఓ పాల్గొన్నారు.

వేడుకగా అబ్దుల్ కలాం జయంతి

కూసుమంచి: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని స్థానిక ప్రియదర్శిని కళాశాలలో మంగళవారం వేడుకగా నిర్వహించారు. దివంగత మాజీ రాష్ట్రపతి చిత్రపటానికి కళాశాల ఛైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు, అధ్యాపకులు నివాళి అర్పించారు. కళాశాల ప్రధానాచార్యుడు బి.గోపాల్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో నామా పర్యటన

ఖమ్మం కార్పొరేషన్: మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు మంగళవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. నగరంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు.

'విలీన సభను జయప్రదం చేయండి'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే టీయూసీఐలో ఇఫ్టూ విలీన సభను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కోరారు. నగరంలో మంగళవారం పాలేరు, ఖమ్మం నియోజకవర్గాల సంయుక్త సమావేశం ములకలపల్లి లక్ష్మీనారాయణ, గోసు పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఇఫ్టూ నగర కార్యదర్శి కె.శ్రీనివాస్, పాలేరు ఏరియా కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, నాయకులు లెనిన్, రమేష్, సక్రు, కోటేశ్వరరావు, ప్రభాకర్, మాధవరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, శ్రీనివాస్, అంబేడ్కర్ పాల్గొన్నారు.

'పెండింగ్ బోధనా రుసుములు విడుదల చేయాలి'

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న బోధనా రుసుములు, ఉపకార వేతనాలను విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

ఆశ్రమంలో అన్నదానం

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: రఘునాథపాలేనికి చెందిన చావా బోసుబాబు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన భార్య విద్యాధరి బల్లేపల్లి మదర్ థెరిస్సా ఆశ్రమంలో అన్నదానం చేశారు.

★ చిమ్మపూడికి చెందిన నాగండ్ల జయమ్మ ఇటీవల మరణించారు. ఆమె కుటుంబాన్ని మాజీ ఉప సర్పంచి, భాజపా నాయకుడు గుత్తా వెంకటేశ్వర్లు మంగళవారం పరామర్శించారు. రూ.50 కిలోల బియ్యం వితరణగా అందజేశారు.

బాధ్యులకు చేప పిల్లల పంపిణీ

కూసుమంచి: 38 చెరువుల్లో వదిలేందుకు ఆయా చెరువుల సహకార సంఘాల బాధ్యులకు అధికారులు మంగళవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఆక్సిజన్ నింపిన పాలిథిన్ కవర్లలో సమకూర్చిన చేప పిల్లలను ఆయా సంఘాల బాధ్యులకు అందించారు. 31 చిన్న చెరువులకు 3.63 లక్షల చేప పిల్లలను, 7 పెద్ద చెరువులకు 3 లక్షల చేప పిల్లలు సమకూర్చినట్లు మత్స్యశాఖ ఏడీ శివప్రసాద్ తెలిపారు.

నగరంలో సినిమాలు.. శ్రీనివాస: వేట్టయన్, శ్రీ తిరుమల: దేవర పార్ట్-1, వినోద: జనక అయితే గనక, కేపీఎస్: మార్టిన్, సీఎస్ సినీ గెలాక్సీ: మా నాన్న సూపర్ హీరో, శ్రీసాయిరాం: విశ్వం

దళితులను చీల్చి రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర: చెన్నయ్య



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జి.చెన్నయ్య, మాల మహానాడు నాయకులు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాకుతో దళితులను చీల్చి రిజర్వేషన్లు లేకుండా చేసే కుట్ర జరుగుతోందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం ఖమ్మం చేరుకుంది. ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో గుంతేటి వీరభద్రం అధ్యక్షతన సభ నిర్వహించారు. వర్గీకరణ విషయంలో దేశంలో ఏ రాష్ట్రం చూపని అత్యుత్సాహం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూపుతున్నారని విమర్శించారు. 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకుంటామని ప్రకటించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దళితుల స్థితిగతులపై అధ్యయనం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి ప్రకటన ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వర్గీకరణ అంశాన్ని సాకుగా చూపి మొత్తం ఉద్యోగాల భర్తీనే నిలిపివేసే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీల వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించారు. తెలంగాణలో వర్గీకరణ అవసరమే లేదని, ఎక్కువ లబ్ధి పొందింది మాదిగలేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పల్లా రాజశేఖర్, లింగాల రవికుమార్, చెరుకు రామచందర్, కరణం కిషన్, బూరుగు వెంకటేశ్వర్లు, తల్లమల్ల హుస్సేన్, ఎర్రమల్ల రాములు, తాళ్లపల్లి రవి, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో యువత ముందుండాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: నేటి యువత సామాజిక కార్యక్రమాలు, సేవలో ముందుండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం సుందరయ్య భవన్‌లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేశ్ అధ్యక్షతన 'యంగ్ కమ్యూనిస్టు వర్క్‌షాప్' మంగళవారం నిర్వహించారు. సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని యువత అధ్యయనం చేస్తూ అవగాహన చేసుకోవాలన్నారు. వ్యక్తిగత జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటూనే సామాజిక సేవలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మద్దాల ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొనుకుల సుధాకర్, తుడుం ప్రవీణ్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని దుర్మరణం

కోదాడ, న్యూస్‌టుడే: కోదాడ నయానగర్‌కు చెందిన పలివెల నాగజ్యోతి(18) నేలకొండపల్లిలో ఇంటర్ చదువుతోంది. మంగళవారం బంధువుల స్కూటీ తీసుకొని పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డు పైవంతెన మీదుగా.. అపసవ్య దిశలో విజయవాడ వెళ్తుండగా ఎదురుగా వచ్చే డీసీఎం ఢీకొంది. దీంతో ఆమె దుర్మరణం చెందింది. యువతి ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోందని, కావాలనే రాంగ్ రూట్‌లో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

కార్మికుడి అదృశ్యం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: మార్బుల్ కార్మికుడు కనిపించకుండా పోయిన సంఘటనపై ఖానాపురం హవేలి పోలీసు స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఖానాపురం ప్రశాంతినగర్‌కు చెందిన మహ్మద్ ఖాజామియా(34) మార్బుల్ పని చేస్తున్నారు. పనికి వెళ్తున్నానంటూ ఇంటి నుంచి సోమవారం ఇల్లెందు క్రాస్‌రోడ్డుకు వెళ్లిన అతను కనిపించకుండా పోయాడు. అతని సైకిల్, భోజనం బ్యాగ్ అడ్డా వద్ద కనిపించాయి. అతని తండ్రి జమాలుద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ భానుప్రకాశ్ తెలిపారు.

మనస్తాపంతో ఆటో డ్రైవర్ బలవన్మరణం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. గొల్లగూడేనికి చెందిన కణతల వీరబాబు(40) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. తాగొద్దని భార్య నాగమణి వారిస్తుండేది. దేవీనవరాత్రి ఉత్సవాలకు వీరబాబు మాలధారణ చేసి మద్యం మానేశాడు. ఉత్సవాల అనంతరం సోమవారం మళ్లీ తాగి వచ్చి భార్య, కొడుకులతో గొడవపడి బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తాను కాల్వ ప్రాంతంలో గడ్డిమందు తాగినట్లు కొడుక్కి ఫోన్ చేసి చెప్పాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతణ్ని ఖమ్మం సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉద్యోగుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తూ ఆర్ఎం సరిరాం ఉత్తర్వులు వెలువరించారు. రీజియన్‌లోని అన్ని డిపోల నుంచి పలు విభాగాలకు చెందిన 13 మందిని బోర్డు సభ్యులుగా నియమించారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆమోదంతో పేర్లను ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలు, ఫిర్యాదులను త్వరగా పరిష్కరించడానికి బోర్డు సభ్యులు కృషి చేస్తారు. యూనిట్ అధికారులు, ఉద్యోగుల మధ్య అంతరం లేకుండా సమన్వయపరుస్తారు. ఆర్టీసీ అధికారులు క్రమం తప్పకుండా సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పేందుకు యత్నిస్తారు. గత ప్రభుత్వ హయాంలో కార్మిక సంఘాలను రద్దు చేసిన తర్వాత ఆర్టీసీలో సంక్షేమ బోర్డుల ఏర్పాటు ప్రక్రియ మొదలైంది.

దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: లబ్ధిదారులు దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో దళితబంధు యూనిట్ల స్థితిగతులపై కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చింతకాని మండలంలో సాచ్యురేషన్ పద్ధతిలో 3 వేలకు పైగా దళితబంధు యూనిట్లు మంజూరు చేసి గ్రౌండింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. రెండో విడతలో 800 యూనిట్ల గ్రౌండింగ్ త్వరలో చేపడతామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి సంబంధిత అధికారులు యూనిట్లను పరిశీలించాలని ఆదేశించారు. తొలి విడతలోని యూనిట్లలో పశుసంవర్ధకశాఖ 492, వ్యవసాయ యంత్రాంగం 223, వాహనాలు 430, ఇతర 242 యూనిట్లు పక్కదారి పట్టాయని, దీనికి కారణాలు తెలుసుకోవాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడీ నవీన్‌బాబు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వేణుమనోహర్, జిల్లా వ్యవసాయశాఖాధికారి పుల్లయ్య, జిల్లా ఇన్‌ఛార్జి రవాణాశాఖాధికారి వెంకటరమణ, చింతకాని ఎంపీడీఓ రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

మైదానంలో ఘర్షణ

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో బుధవారం ఘర్షణ చోటుచేసుకొంది. ఇక్కడి హ్యాండ్‌బాల్ కోర్టులో కొందరు ఫుట్‌బాల్ ఆడుతున్నారు. వారు తన్నిన బంతి పక్కనే ఉన్న స్కేటింగ్ ప్రాంగణంలో పడింది. బంతి తగిలితే చిన్నారులకు ప్రమాదం జరిగి ఉండేదని ఆగ్రహించిన స్కేటింగ్ శిక్షకుడు బంతిని ఇవ్వలేదు. ఫుట్‌బాల్ బృందం తరఫున వచ్చిన వారు వాగ్వాదానికి దిగారు. తమ శిక్షణ పూర్తయ్యే వరకు ఇక్కడ ఫుట్‌బాల్ ఆడవద్దని స్కేటింగ్ బృందాలు, అదేమిటని ఫుట్‌బాల్ బృందం మధ్య ఘర్షణ జరిగింది. కాసేపటికి గొడవ సద్దుమణిగి ఎవరి దారిన వారు వెళ్లారు.

బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌కు వినతి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పార్లమెంటు ఎన్నికల సమయంలో ఖమ్మం నియోజకవర్గంలో చేపట్టిన ఎన్నికల పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని పలువురు గుత్తేదారులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

తాళం తీయనివ్వని యజమాని

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: 9 నెలలుగా భవనం అద్దె చెల్లించడం లేదని భవన యజమానికి కోపం వచ్చింది. గురుకుల పాఠశాల తాళం తీయకుండా అడ్డుకున్నాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో వారి హామీతో తలుపులు తెరుచుకున్నాయి. ఖమ్మం నగర శివారు బొమ్మ కళాశాల ప్రాంగణంలో ఎస్సీ గురుకుల పాఠశాల(తిరుమలాయపాలెం) నిర్వహిస్తున్నారు. మంగళవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రిన్సిపల్, సిబ్బంది సోమవారం ప్రాంగణాన్ని శుభ్రం చేసేందుకు గురుకులానికి వచ్చారు. భవన యజమాని అందుకు అడ్డు చెప్పాడు. 9 నెలలుగా అద్దె చెల్లించడం లేదని, కరెంటు బిల్లు ఇవ్వడం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. మొదట గురుకులాల జోనల్ అధికారికి సమాచారం ఇవ్వడంతో ఆమె జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. ఉన్నతాధికారుల హామీ మేరకు భవన యజమాని తాళం తీసినట్లు తెలుస్తోంది.

మరమ్మతులకు మోక్షమెన్నడో...



వరదలకు కొట్టుకుపోయిన వంతెన అప్రోచ్ రోడ్డు

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: ఇటీవల ఆకేరు, పాలేరు, మున్నేరు వాగులకు వచ్చిన వరద ఉద్ధృతికి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. వంతెనలు విరిగిపడ్డాయి. తిరుమలాయపాలెం- మహబూబాబాద్ ప్రాంతాలను కలిపే రహదారిలో అజ్మీరతండా సమీపంలో ఆకేరు వాగుపై మూడేళ్ల క్రితమే వంతెన నిర్మించారు. అనేక అవాంతరాల నడుమ ఆరు నెలల క్రితం ప్రారంభించారు. తిరుమలాయపాలెం మండలం అజ్మీరతండా, రాకాసితండా మీదుగా మహబూబాబాద్‌ను కలిపే ఉండే ఈ మార్గం కూసుమంచి, తిరుమలాపాలెం, మహ-బాద్ జిల్లాలోని ములకలపల్లి మండల వాసులకు ఎంతో ఉపయుక్తం. ఇటీవల వరదలకు వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకపోయింది. ముందు భాగంలో ఉన్న మట్టి ఆనవాళ్లు లేకుండాపోవటంతో ప్రమాదకరంగా మారింది. దీంతో ఆటోలు, బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు సాగించటం లేదు. ద్విచక్ర వాహనాలు మాత్రమే వంతెనపై వెళ్లగలుగుతున్నాయి. ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు. నీటిపారుదల డీఈఈ రమేశ్‌రెడ్డిని వివరణ కోరగా త్వరలో అక్కడున్న సమస్యను పరిష్కరించి చర్యలు చేపడతామన్నారు.